# నిబంధనల ఉల్లంఘనతో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడి తొలగింపు



**కొత్తగూడెం, జూలై 06 (తెలంగాణ వాణి)** సమాఖ్య నిబంధనలకు విరుద్ధంగా, క్రమశిక్షణా రాహిత్యంతో వ్యవహరించినందుకు యు. హరీష్‌ను ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలగించడంతో పాటు ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె. ఫహీమ్ తెలిపారు. ఇకపై ఆయనకు ఏఐవైఎఫ్, విద్యార్థి సమాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఖాళీ అయిన జిల్లా అధ్యక్ష పదవికి త్వరలో నిర్మాణ మహాసభ నిర్వహించి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యూమ్, నాయకులు భూపేష్, రణధీర్, రవి, అజయ్, శివ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి



**కొత్తగూడెం, జూలై 06 (తెలంగాణ వాణి)** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత, జాతీయ ఐక్యత, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని అన్నారు. ఆయన ఆయన ఆశయాలను సిద్ధాంతాలను ప్రతి భారతీయ



జనతా పార్టీ కార్యకర్త నిబద్ధతతో పని చేసినప్పుడే భారతదేశ విశ్వ గురువుగా మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ఆకాంక్షలకు అనుగుణంగా 140 కోట్ల భారతీయుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు. దేశ ఐక్యత, దేశ సమగ్రత, దేశభక్తి కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయడం ద్వారానే డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కి అర్పించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలి పీఆర్టీయూటీఎస్ డిమాండ్



**లక్ష్మీదేవిపల్లి, జూలై 06 (తెలంగాణ వాణి)** పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏలను వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. నరసయ్య, చింతపల్లి ప్రభాకర్ రావు డిమాండ్ చేశారు. సోమవారం మండలపరిధిలోని ఇందిరానగర్ కాలనీ పాఠశాలలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం ఇస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. పీఆర్సీ కమిటీ వేసి దాదాపు మూడు సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు నివేదికను తెప్పించి ప్రకటించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఉపాధ్యాయులకు అనేక సమస్యలు ఉన్నా వాటిని పక్కనపెట్టి భోజనాలు, అల్పాహారాల పేరుతో అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులు కోరుకునేది పీఆర్సీ, డీఏల ప్రకటన అని, ప్రభుత్వం వెంటనే వాటిని అమలు చేయడంతో పాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భాస్కర్, రవీందర్, జిల్లా కార్యదర్శులు రమేష్, తిరుపతమ్మ, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు లక్ష్మీపతి, కొత్తగూడెం మండల అధ్యక్షుడు భాస్కర్, ప్రాసెట్ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల బలోపేతానికి రైతులంతా ముందుకు రావాలి : మండే వీర హనుమంతరావు



**చుంచుపల్లి, జూలై 06 (తెలంగాణ వాణి)** అంతర్జాతీయ సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా రైతులు సహకార సంఘాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్, కొత్తగూడెం అధ్యక్షుడు మండే వీర హనుమంతరావు పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో జూన్ 29 నుంచి జూలై 6 వరకు నిర్వహించిన అంతర్జాతీయ సహకార వారోత్సవాల ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, రైతులు వాటిని వినియోగించుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు.సంఘం ద్వారా పావలా వడ్డీపై 2,653 మంది రైతులకు రూ.1.34 కోట్లకు పైగా పంట రుణాలు అందించామని తెలిపారు. అలాగే 21 మంది రైతులకు రూ.20 లక్షల మధ్యకాలిక రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ట్రాక్టర్లు, పౌల్ట్రీ తదితర అవసరాలకు దీర్ఘకాలిక రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.సుజాత్‌నగర్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి ప్రాంతాల్లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామని, త్వరలో జనరిక్ మందులను కూడా అందించనున్నట్లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫీఫా) ద్వారా 750 మంది రైతుల నుంచి రూ.15 లక్షల షేర్ మూలధనం సమీకరించి, కేంద్ర ప్రభుత్వం నుంచి అంతే మొత్తంలో మ్యాచింగ్ గ్రాంట్ పొందామని చెప్పారు. ఆ నిధులతో సుజాత్‌నగర్ గోదాంలో పురుగుమందుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఖరీఫ్, రబీ సీజన్లలో సంఘం పరిధిలో 10 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 2 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసినట్లు వివరించారు. సుజాత్‌నగర్‌లో 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మించామని, చుంచుపల్లి మండలంలో కార్యాలయ భవన నిర్మాణానికి 0.19 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార యూనియన్ లెక్చరర్ పి. రాజయ్య, సహకార శాఖ ప్రతినిధి కె. శ్రీనివాసరావు, డీసీసీ బ్యాంక్ కొత్తగూడెం మేనేజర్ శ్రీమతి రాగమయి, క్లస్టర్ సూపర్వైజర్ వి. సురేష్, సంఘ కార్యవర్గ సభ్యులు కె. రామచందర్‌రావు, పోటు వెంకటేశ్వరరావు, తీట్ల విజయకుమారి, కంటెం సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# దయాగ్నసిస్ సెంటర్ నిర్వాహకుడికి జైలు శిక్ష

**కొత్తగూడెం, జూలై 06 (తెలంగాణ వాణి)** దయాగ్నసిస్ సెంటర్ నిర్వాహకుడికి మూడు సంవత్సరాల జైలు 10,000/- రూపాయల జరిమాన విధిస్తూ దమ్మపేట జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డాక్టర్ బి. భవాని తీర్పు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ జి అశ్విని అశ్వారావుపేట పెద్దిరాజు నిర్వహించే సాగర్ సెంటర్ ను 2015 మే 11 న ఇన్స్పెక్షన్ చేయగా లైసెన్సు లేకుండా బ్లడ్ శాంపుల్స్ తీస్తున్నారు. అది డ్రగ్స్ చట్ట ప్రకారం నేరం అని కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. కోర్టులో నల్లగురు సాక్షులను విచారించారు. మార్త పెద్దిరాజు పై నేరములు రుజువు కావడంతో మూడు సంవత్సరముల జైలు శిక్ష, రు. 10,000/-జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసెక్యూషన్ ను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్. శ్రీధర్ నిర్వహించారు.

# హాస్పిటల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ పిట్ కమిటి సమావేశంలో మిర్యాల రంగయ్య



**కొత్తగూడెం సింగరేణి, జూలై 06 (తెలంగాణ వాణి)** ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య పేర్కొన్నారు. సోమవారం ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొనాలని మాట్లాడారు. హాస్పిటల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సిఎంఓ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, ఆసుపత్రిలో మెరుగైన పనివాతావరణం కల్పించడమే ఏఐటియుసి లక్ష్యమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల ప్రభావంతో సింగరేణిపై పడుతున్న ఆర్థిక భారం, సంస్థ ఎదుర్కొంటున్న నష్టాలపై ఆయన వివరించారు. సింగరేణి పరిరక్షణకు కార్మికులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.సమావేశంలో హాస్పిటల్లో విధులు నిర్వహిస్తున్న నర్సులకు అదనపు వాష్రూమ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే పెండింగ్లో ఉన్న ఇతర సమస్యలపై కూడా విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారం కోసం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కార్పొరేట్ ఉపాధ్యక్షులు కిష్టాఫర్ ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎఐటియుసి పోరాటంతో సర్ఫస్ వెబ్ కౌన్సిలింగ్ తాత్కాలిక నిలిపివేత



**కొత్తగూడెం సింగరేణి, జూలై (తెలంగాణ వాణి)** ఎఐటియుసి ఒత్తిడి ఫలితంగా రేపు నిర్వహించాల్సిన సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ వెబ్ కౌన్సిలింగ్ను యాజమాన్యం తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ తెలిపారు. సర్ఫస్ కన్వర్షన్లో ముందుగా పీవీకే-5 భూగర్భ గని అర్హులైన కార్మికులకే ప్రాధాన్యత ఇవ్వాలని, అనంతరం ఖాళీల భర్తీ చేపట్టాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్ హుమాయూన్, నాయకులు లక్ష్మీనారాయణ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక శాఖ ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం ! అందని అవుట్ సోర్సింగ్ వేతనాలు

**ఒకటో తేదీన వేతనాలు అందేలా చూడలంటూ పాలిటెక్నిక్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ 'విజ్ఞప్తి**

**హైదరాబాద్, జూన్06 (తెలంగాణ వాణి ప్రతినిధి)** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని 'తెలంగాణ గవర్నమెంట్ పాలిటెక్నిక్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్' ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ నెల 1వ తేదీన కొంతమందికి మాత్రమే వేతనాలు అందించి, మిగిలిన వారికి నిలిపివేయడంపై అసోసియేషన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే, ఆర్థిక శాఖ గతంలో ఇచ్చిన ఉద్యోగ కొనసాగింపు గడువు జూన్ 30తో ముగిసిందని వారు గుర్తు చేశారు. కావున ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి, అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తదుపరి రెన్యువల్ జీవోలు ఇచ్చేలా ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్థిక శాఖ జూన్ 30 తర్వాత కూడా ఎలాంటి రెన్యువల్ జీవోలు లేకున్నా వేతనాలు ఇవ్వాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారులు వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. కొన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ రెన్యువల్ జీవో లేదనే నెపంతో జీతాల బిల్లులను పంపడం లేదని, మరికొన్ని చోట్ల ఎస్టీఓ, డీటీఓ ట్రెజరీ కార్యాలయాల్లో బిల్లులను తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొన్ని చోట్ల వివిధ కారణాలతో ఉద్యోగులను విధుల్లోంచి తొలగించి, ఇంతవరకు తిరిగి తీసుకోకపోవడం వల్ల వారి వేతనాలు పూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఒకటో తేదీన జీతాలు అందకపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి "అందని ద్రాక్షపండు"లా తయారైందని, ఇళ్ల అద్దెలు, పిల్లల ఫీజులు, నిత్యావసర ఖర్చుల కోసం కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అసోసియేషన్ అధ్యక్షులు మారపల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. బాబు ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి, ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# సెంట్రల్ వర్క్ షాప్ కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ పరికరాలు పంపిణీ



**కొత్తగూడెం సింగరేణి, జూలై 06 (తెలంగాణ వాణి)** సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో గల సెంట్రల్ వర్క్ షాప్, బివబర్ హౌస్, 132 కెవి సబ్ స్టేషన్ కాంట్రాక్ట్ కార్మికులకు ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుల చేతుల మీదుగా రక్షణ పరికరాలను సోమవారం నాడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్షణ పరికరాలను ఉపయోగించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, గాయాల పాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యూనియన్ విజ్ఞప్తి మేరకు సెంట్రల్ వర్క్ షాప్ హౌస్ కీపింగ్ కార్మికులకు షూస్, హెల్మెట్లు అందజేసిన కాంట్రాక్టర్ ఎం నరసింహారావుకు యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కృష్ణా ఫర్ లు నాయకులు మురళి, సూపర్వైజర్ రవికుమార్, రాజేష్, సరోజ, రామ, కరీం, కనక లక్ష్మి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆరాధ్యుడు జగ్జీవన్ రామ్ : డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల



**పాల్వంచ, జూలై 06 (తెలంగాణ వాణి)** పేద, బడుగు, బలహీన, అణగారిన వర్గాల ప్రజల ఆరాధ్యుడు ఆశా కిరణం జగ్జీవన్ రామ్ అని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు భారతదేశ మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్వాల నాయకత్వంలో నివాళులర్పించారు. పాల్వంచ బస్టాండ్ వద్ద జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కొత్వాలతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ దేశంలోని బడుగు వర్గాల ప్రజలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికపరంగా, సముచిత స్థానం లభించినప్పుడే ఆయన ఆత్మ కి శాంతి చేకూరుతుందన్నారు. దేశంలో సమ సమాజ స్థాపన కోసం జగ్జీవన్ రామ్ చేసిన కృషి స్ఫూర్తిదాయకమని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు, సీరపు సుగుణ, నాయకులు మహిపతి రామలింగం, దండోరా శ్రీను, బండి లక్ష్మణ్, వై.వెంకటేశ్వరరావు, ఎస్.కె భాషా, బండి నాగరాజు, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జన్మదినం వేడుకలు



**ఖమ్మం, జూలై 06 (తెలంగాణ వాణి)** మేరా యువ భారత్ సహకారంతో పువ్వాడ నగర్ జాగృతి యూత్ అసోసియేషన్ వారు మహిళా డిగ్రీ కళాశాల నందు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జన్మదిన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భానోత్ రెడ్డి, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ రామ కుమార స్వామి, కవిత, మేరా యువ భారత్ ప్రోగ్రాం మరియు అకౌంట్స్ ఆఫీసర్ కే. భాను చందర్ పాల్గొన్నారు. ముందుగా వీరు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి అర్పించారు. ప్రిన్సిపాల్ భానోత్ రెడ్డి గారు మాట్లాడుతూ డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ (జూలై 6, 1901 -- జూన్ 23, 1953) ప్రముఖ విద్యావేత్త, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు మరియు అఖండ భారతదేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప జాతీయవాది. జమ్మూ కశ్మీర్ పోరాటం మరియు బలిదానం సంపూర్ణంగా విలీనం కావాలని, "ఒకే దేశం - ఒకే రాజ్యాంగం" ఉండాలని ఆయన బలంగా ఆకాంక్షించారు. విద్యాభ్యాసం, రాజకీయ ప్రస్థానం మరియు పాత్ర వంటి విషయాలు విద్యార్థులకు వివరించడం జరిగింది. క్విజ్ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించగా అందులో మొదటి, ద్వితీయ బహుమతులు మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన అనంతరం ర్యాలీ తీయించడం జరిగింది.

## విజయవంతంగా ముగిసిన నాల్గవ విడత మెగా సర్జికల్ క్యాంపు



**అచ్చంపేట, జూలై 06 (తెలంగాణ వాణి)** ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన నాల్గవ విడత మెగా సర్జికల్ క్యాంపు విజయవంతంగా ముగిసిందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. ఈ క్యాంపు ద్వారా 300 మంది రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు చెప్పారు. ఇప్పటికే నమోదు చేసుకున్న మిగిలిన వారికి త్వరలో మరో ప్రత్యేక మెగా సర్జికల్ క్యాంపు నిర్వహించి ఉచిత ఆపరేషన్లు చేపడతామని తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్డెంట్ శ్రీనివాసులు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ తార సింగ్, డా. ప్రభు, డాక్టర్ మహేష్, ప్రతిప్ రాజ్, బాల్ సింగ్, ఇతర మహిళ డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు

## డీజీపీ సీవీ ఆనంద్‌కు మొక్క బహూకరించిన నైనిక రజువా

**తొలి సమయం, కొత్తగూడెం, జూలై 06 :** రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా పచ్చని మొక్కను బహూకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం హేమచంద్రపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నూతన



పోలీస్ గెస్ట్‌హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న నైనిక రజువా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ చెన్నూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్

**టేకులపల్లి, జూలై 6 (తెలంగాణ వాణి)** మండల పరిధిలోని శంభునిగూడెం ముర్రేడువాగు నుంచి అక్రమంగా ఇసుకను ఇల్లందు వైపు తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తడికెలపూడి ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ అక్రమ రవాణా వెలుగుచూసింది. ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ నిబంధనల ఉల్లంఘనకు గాను మంగ్య తండా,కొత్తతండా(జి)నివాసి అయిన డ్రైవర్ మాలోత్ సురేందర్ (23)తో పాటు,ట్రాక్టర్ యజమాని బానోత్ శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు టేకులపల్లి పోలీసులు వెల్లడించారు.అక్రమ రవాణాపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.